నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, శనివారం 26 ఏప్రిల్ 2025 | BHADRADRI KOTHAGUDEM

ఎల్కతుర్తికి ఎల్లుడే..

- చేతిలో గులాబీ జెండాతో రజతోత్సవానికి సిద్ధం
- బీఆర్ఎస్ పండుగకు ఉమ్మడి జిల్లా నుంచి జనసందోహం
- ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న పార్టీ జిల్లా నాయకత్వం
- ప్రత్యేక రూట్‌మ్యాప్ సిద్ధం చేసిన రాష్ట్ర నాయకత్వం
- ఇప్పటికే అన్ని మండలాల్లో సభలు, సమావేశాలు
- రేపు గ్రామగ్రామాన పార్టీ జెండాల ఆవిష్కరణలు
- సభ విజయవంతానికి ముఖ్య నేతల విశేష కృషి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గులాబీ పరిమళాలు గుబాళిస్తున్నాయి. గులాబీ సైనికులు రెండు నెలలుగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. మరో 24 గంటల్లో ఉమ్మడి జిల్లా గులాబీ మయం కానుంది. వేలాది మంది గులాబీ సైన్యం వరంగల్ సభకు కదిలివెళ్లే పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఒకచేతిలో గులాబీ జెండా, మరో చేతిలో చద్దిమూట పట్టుకొని ఎల్కతుర్తికి బయలుదేరేందుకు సిద్ధమై ఉన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటుతున్నారు.

–ఖమ్మం, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

2001, ఏప్రిల్ 27న ఉద్యమసారథి కేసీఆర్ నేతృత్వంలో పురుడుపోసుకున్న టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) నేటితో 24 ఏళ్ల యవ్వన దశను దాటుతోంది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని కనీవినీ ఎరుగని పోరాటాలను నిర్మించి చుక్క రక్తాన్ని కూడా చిందకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి చరిత్ర సృష్టించింది. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో తన కంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్న బీఆర్ఎస్.. తెలంగాణ తెచ్చుకొని రెండు పర్యాయాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 25వ పుట్టిన రోజు వేడుకలను ఉద్యమాలకు ఊపిరిలాంటి వరంగల్ గడ్డపై నిర్వహించేందుకు పార్టీ అధినాయకత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. పార్టీ గ్రామస్థాయి కార్యకర్త నుంచి అగ్రనేతల వరకూ అందరూ ఈ సభ విజయవంతం చేయడానికి విశేష కృషి చేస్తున్నారు. ఉద్యమ ఘట్టాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వంటి ఎన్నో అంశాలను రజతోత్సవంలో పార్టీ అధినాయకత్వం తమ ముందు ఉంచనుందని తెలంగాణ సమాజం భావిస్తోంది.

పల్లెపల్లె నుంచి ప్రత్యేక వాహనాలు..

వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతీ గ్రామం నుంచి వేలాది మంది ప్రజలు కదిలి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో ప్రజలు, పార్టీ శ్రేణులు వెళ్లేందుకు నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బస్సులు, కార్లు, ఇతరత్రా వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ఎండ తీవ్రత ఉన్నందున రక్షణ కోసం గొడుగులు, చల్లటి నీటి కోసం కూలింగ్ క్యాన్లు, భోజనం, పులిహోర, టిఫిన్ లాంటి ఏర్పాట్లు చేస్తున్నారు. క్రమపద్ధతిలో సభా స్థలికి చేరుకునేందుకు, వాహనాలను పార్కింగ్ చేసేందుకు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. భద్రాద్రి జిల్లా పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం, కొత్తగూడెం నియోజకవర్గాలతోపాటు ఇల్లెందు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల నుంచి వెళ్లే వాహనాలకు జోన్–1లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాలతో పాటు ఇల్లెందు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల నుంచి వెళ్లే వాహనాలకు జోన్–2లో పార్కింగ్ ఏర్పాటు చేశారు.



పింక్ కలర్ సభాస్థలి, ఎల్లో కలర్ భద్రాద్రి జిల్లా వాహనాల పార్కింగ్



పింక్ కలర్ సభాస్థలి, గ్రీన్ కలర్ ఖమ్మం జిల్లా వాహనాల పార్కింగ్

రేపు ఊరూరా జెండావిష్కరణలు

బీఆర్ఎస్ పుట్టిన రోజు వేడుకలను గ్రామగ్రామాన పండుగ వాతావరణంలో జరపాలని పార్టీ అధినాయకత్వం నిర్ణయించింది. దీంతో శుక్రవారం ఉమ్మడి ఖమ్మంలోని అన్ని మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు గులాబీ జెండాలని ఎగురవేశారు. ఆదివారం నాడు గ్రామగ్రామాన గులాబీ జెండాలను ఎగురవేసి వరంగల్ సభకు బయలుదేరనున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లోనూ బీఆర్ఎస్ గద్దెలను ముస్తాబు చేశారు. లేని గ్రామాల్లో కొత్తగా పార్టీ దిమ్మెలను నిర్మించారు.

దిమ్మెలను సిద్ధం చేస్తున్న కార్యకర్తలు

ముమ్మర ప్రచారం చేసిన నేతలు..

రజతోత్సవ సభ విజయవంతానికి ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతలందరూ విశేష కృషి చేస్తున్నారు. గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో విస్తృతంగా పర్యటించి సన్నాహక సమావేశాల్లో శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోతు హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, బానోతు మదన్‌లాల్, చంద్రావతి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆయా నియోజకవర్గాల్లో కార్యకర్తలతో సమావేశమై సూచనలు చేశారు.

సభా స్థలిని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

రూట్ మ్యాప్, పార్కింగ్ నిర్వహణపై సూచనలు చేసిన ఎంపీ వద్దిరాజు, రేగా, హరిప్రియ, మెచ్చా

ఇల్లెందు/ భద్రాచలం/ మణుగూరు టౌన్, ఏప్రిల్ 25: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27 జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభా స్థలిని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియానాయక్, మెచ్చా నాగేశ్వరరావు, భద్రాచలం నాయకులు మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్‌లు తదితరులు శుక్రవారం పరిశీలించారు. ఆయా నియోజకవర్గాల నుంచి లక్షలాదిగా బీఆర్ఎస్ శ్రేణులు, పార్టీ అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎక్కడా ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసిన వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. రూట్ మ్యాప్‌ను పరిశీలించడంతోపాటు ఏర్పాట్లలో నిమగ్నమైన నాయకులకు పార్కింగ్ విషయమై పలు సూచనలు చేశారు. బీఆర్ఎస్ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందున ప్రతి ఒక్కరూ సభకు హాజరుకావాలని, కేసీఆర్ ప్రసంగాన్ని పూర్తిస్థాయిలో వినాలని కోరారు. బీఆర్ఎస్ నేతలు దండిగాల రాజేందర్, లక్కినేని సురేందర్‌రావు, సిలివేరి సత్యనారాయణ, బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, పరుచూరి వెంకటేశ్వరరావు, జాఫర్ హుస్సేన్, శీలం రమేష్, ఆకోజు సునీల్‌కుమార్, రేపాక పూర్ణచందర్‌రావు, కణితి రాముడు, ఎండీ జానీ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తితో సభాస్థలిని పరిశీలించి అభివాదం చేస్తున్న ఎంపీ వద్దిరాజు, చిత్రంలో రేగా, మెచ్చా, హరిప్రియ, దండిగాల

రజతోత్సవ సభకు తరలిరండి

- కేసీఆర్ 25 ఏండ్ల ప్రస్థానంలో ఎన్నో మలుపులు
- గాంధేయ మార్గంలో తెలంగాణ రాష్ట్రం సాకారం
- ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తాతా మధు
- బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలాలి: సండ్ర, కందాళ

ఖమ్మంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, చిత్రంలో సండ్ర, కందాళ, కొండబాల, చంద్రావతి, కూరాకుల తదితరులు

ఖమ్మం, ఏప్రిల్ 25: ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఖమ్మం జిల్లా ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ కోసమే పార్టీని స్థాపించి, రక్తపు చుక్క చిందించకుండా రాష్ట్రాన్ని సాధించి, పదేండ్లు బంగారు తెలంగాణను నిర్మించిన కేసీఆర్ సారథ్యంలో ఏర్పడిన బీఆర్ఎస్ ఈ 24 ఏండ్లలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, అవమానాలను చవిచూసిందన్నారు. గాంధేయమార్గంలో ఉద్యమం చేసి రాష్ట్ర ఏర్పాటు కలను కేసీఆర్ సాకారం చేశారన్నారు. బీఆర్ఎస్ పథకాలు, ప్రజాసంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత హామీలు నమ్మి ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారని, 16 నెలల పాలనలోనే కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఆర్ఎస్ మాత్రమే పనిచేస్తుందని ప్రజలు ఇప్పుడు గుర్తుకు తెచ్చుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ముందుకుసాగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. బహిరంగ సభకు ఖమ్మం జిల్లా నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆరోపించారు. జిల్లాలోని ఏ ప్రాంతానికి వెళ్లినా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ సభకు ఉమ్మడి జిల్లా నుంచి భారీఎత్తున ప్రజలు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి ముందుగా జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి కోసం మౌనం పాటించారు. బీఆర్ఎస్ నేతలు కొండబాల కోటేశ్వరరావు, బానోత్ చంద్రావతి, కూరాకుల నాగభూషణం, వరప్రసాద్, కర్నాటి కృష్ణ, మక్బూల్, ఉప్పల వెంకటరమణ, బెల్లం వేణుగోపాల్, బాషబోయిన వీరన్న, వేముల వీరయ్య, తాజుద్దీన్, బిచ్చాల తిరుమలరావు, సతీశ్, మంచానాయక్, బానోత్ రవి, జమీల్ షేక్, ఉపేందర్‌రెడ్డి, ముత్యాల వెంకటప్పారావు, సద్దాం షేక్ తదితరులు పాల్గొన్నారు.

సభను సక్సెస్ చేయాలి: లింగాల

మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

మధిర, ఏప్రిల్ 25: ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభను సక్సెస్ చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా మధిరలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

ఎక్కడున్నా.. ఎల్కతుర్తి సభకు రండి..

- జెండా ఆవిష్కరణలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్
- అధిక సంఖ్యలో తరలిరావాలి: మాజీ ఎమ్మెల్యేలు కందాళ , సండ్ర

కూసుమంచిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందాళ, చిత్రంలో తాతా మధు, సండ్ర

కూసుమంచి, ఏప్రిల్ 25 : ఎవరెవరు ఎక్కడున్నా ఒక్కరోజు ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని, దీనిని పార్టీ పండుగలా భావించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కోరారు. కూసుమంచి మండలం మంగళితండా, ఈశ్వరమాధారం, రాజుపేట బజార్‌లో బీఆర్ఎస్ పార్టీ జెండాల ఆవిష్కరణ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ 25 ఏళ్లు తెలంగాణ హక్కులు, సమస్యలపైనే పోరాటం సాగించి సాధించుకున్న తెలంగాణాలో అన్ని వనరులు, వసతులు ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. రజితోత్సవ సభ కోసం ఇంటి పండుగలా కదిలిరావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ పార్టీ రజతోత్సవ సభకు పల్లెలన్నీ కదలిరావాలని, ఇందుకోసం వాహనాలు సమకూర్చుతామన్నారు. అలాగే పార్టీ జెండాలు ఎగురవేయాలని సూచించారు. మాజీ సీఎం ఖమ్మం నుంచి ఎక్కువగా తరలించాలని సూచించారని కోరారు. బీఆర్ఎస్ నాయకులు వేముల వీరయ్య, ఆసిఫ్ పాషా, బాలకృష్ణ, కొలిశెట్టి శ్రీను, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ సభకు సైనికుల్లా కదలిరావాలి

బీఆర్ఎస్ జెండావిష్కరణలో మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

వైరాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్

వైరా టౌన్, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రతీ పల్లె నుంచి సైనికుల్లా కదలిరావాలని వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బానోతు మదన్‌లాల్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం సందర్భంగా స్థానిక రింగు రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. గత పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేసి అన్ని వర్గాలకు అందించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతలు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, ముళ్లపాటి సీతారాములు, కృష్ణార్జున్‌రావు, విశ్వేశ్వరరావు, తడికమళ్ల నాగేశ్వరరావు, మాదినేని ప్రసాద్, మాదినేని లక్ష్మణ్, పారుపల్లి నాగం, కామినేని శ్రీనివాసరావు, కొత్తా వెంకటేశ్వరరావు, లాల్‌మహ్మద్, దొంతబోయిన వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భూములున్న వాళ్లకు ఇందిరమ్మ ఇళ్లిచ్చారంటూ అధికారులను నిలదీస్తున్న గుర్రాలచెరువు పేదలు

భూములున్న వాళ్లకే ఇళ్లా?

- తలదాచుకునే గూడు కూడా లేని మాలాంటోళ్లకు ఇళ్లే ఇవ్వరా?
- ఇందిరమ్మ కమిటీల బాధ్యులు వారికిష్టమైనోళ్ల పేర్లు రాసుకున్నారు..
- అశ్వారావుపేటలో విచారణ అధికారులను నిలదీసిన నిరుపేదలు

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 25 : సాగు భూములున్న వాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఎలా ఇస్తారని భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుర్రాలచెరువు గ్రామస్తులు అధికారులను నిలదీశారు. తలదాచుకునేందుకు కూడా గూడు లేని తమకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని, అనర్హులకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని ఆరోపించారు. భూములున్నవాళ్లకు ఇళ్లిస్తే.. నిలువ నీడ కూడా లేని తమలాంటి నిరుపేదల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అశ్వారావుపేట మండలం గుర్రాలచెరువు గ్రామంలో ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాపై ప్రత్యేక అధికారులు శుక్రవారం గ్రామంలో విచారణ నిర్వహించారు. గ్రామంలో సాగు భూములున్న వాళ్ల ఇళ్లకు వెళ్లి విచారణ చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న నిరుపేదలు.. విచారణాధికారులైన డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, మున్సిపల్ అధికారులను అడ్డగించారు. ఇందిరమ్మ కమిటీల బాధ్యులు వారికిష్టమైన వారి పేర్లను, భూములున్న వారి పేర్లనే అర్హుల జాబితాలో రాశారని ఆరోపించారు. మరి కనీసం సరైన ఇల్లు కూడా లేక తాటాకు గుడిసెల్లో బతుకుతున్న తమలాంటి పేదల పేర్లు ఎందుకు రాయలేదని చుంద్రు రాము, కలపాల మరియమ్మ, కలపాల సరస్వతి, బొక్కా మరియమ్మ, యారా రామకృష్ణ, యారా బాలాజీ, కలపాల రాంబాబు తదితరులు ప్రశ్నించారు. అసలు ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన అర్హుల పూర్తి జాబితాను వెల్లడించాలని డిమాండ్ చేశారు. దీంతో జాబితాలో ఉన్న పేర్లను అధికారులు చదివి వినిపించారు. దాంట్లోనూ సాగు భూములున్న మరికొందరి పేర్లు ఉండడంతో నిరుపేదలు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, నిరుపేదలు అభ్యంతరం వ్యక్తం చేసిన వారి వివరాలను నమోదు చేసుకున్నామని, వారి అర్హతలు, అనర్హతలపై విచారణ చేస్తామని అధికారులు సమాధానమిచ్చారు. అయితే, తమకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని నిరుపేదలు అన్నారు.